బకాయిలు అందేనా?

వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట దిగుబడులు కొన్న రోజునే రైతులకు వ్యాపారులు డబ్బులు చెల్లించాలని ప్రభుత్వ నిబంధన. అతిక్రమిస్తే వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటారు. అదే ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసి మూడు నెలలైనా డబ్బులివ్వకపోతే ఏమనాలి? ఎవరిపై చర్యలు తీసుకోవాలి? సమాధానం లేని ప్రశ్నలు. ధరలు పతనమై దిక్కులు చూస్తున్న ఉల్లి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసింది. వారం పది రోజుల్లోగా కొనుగోలు చేసిన ఉల్లి డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి అధికారులు మూడు నెలలు గడిచినా ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బకాయి డబ్బులు రాక, పెట్టుబడి కోసం అప్పులు ఇచ్చినవారికి సమాధానం చెప్పలేక కష్టజీవులు ఇబ్బందులు పడుతున్నారు.



ఓర్వకల్లుకు చెందిన ఓ రైతు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని ఉర్దూ విశ్వవిద్యాలయం అసంపూర్తి భవనాల్లో ఆరబోశారు. ధర లేక మార్కెట్‌కు తీసుకెళ్లకపోవడంతో ఇలా మొలకలు వచ్చాయి.

కర్నూలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 57,700 ఎకరాల్లో ఉల్లి సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. ఎకరాకు పెట్టుబడి రూపంలో రూ.లక్షకు పైగా ఖర్చు వస్తుందని రైతులు అంటున్నారు. ఉల్లి సాగు చేసిన వారిలో మెజార్టీగా కౌలు రైతులే ఉన్నారు. పంట చేతికొచ్చే సమయంలో అగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు ఉల్లి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. అరకొర పంటను కర్నూలు మార్కెట్‌కు తీసుకొస్తే.. ధరలు పతనమై కష్టజీవులు దిక్కులు చూడాల్సి వచ్చింది. క్వింటా రూ.250 నుంచి రూ.750కు మించి కొనుగోలు చేసే నాథుడే లేడు. పైగా నాణ్యత లేదంటూ టెండరు కూడా వేయకపోతే కొందరు రైతులు రోడ్డున పారబోశారు. పంటకోత, రవాణా ఖర్చులు కూడా రాకపోగా హమా లీ ఖర్చులు అదనంగా భరించాల్సి రావడంతో రైతులు పొలంలోనే వదిలేశారు. ఉల్లి రైతులకు భరోసా ఇస్తూ ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు క్వింటా రూ.1,200కు కొనుగోలు చేపట్టింది. కొంతైనా డబ్బులు చేతికొస్తాయని, పెట్టుబడి వడ్డీలైన కట్టవచ్చనే ఆశతో మళ్లీ అప్పులు చేసి పంట కోసి మార్కెట్‌కు తెచ్చారు. ఏపీ మార్కెట్ ఫెడ్ కేంద్రాల్లో అమ్మకాలు చేశారు. వారం పది రోజుల్లో ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ఆశించిన మట్టిమనుషులకు నిరాశే మిగిలింది.



కర్నూలు మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ఉల్లి (ఫైల్)

ఇచ్చింది రూ.10కోట్లే

కర్నూలు మార్కెట్ యార్డులో ఆగస్టు 31నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ నేరుగా కొనుగోలు చేసింది. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్సుడ్ వ్యాపారులు కలిపి 2,800 మంది రైతుల నుంచి 1.55లక్షల క్వింటాళ్ల ఉల్లి సేకరించారు. రైతుల ఖాతాలో రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. రైతుల నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఈ-క్రాప్ జిరాక్స్ కాపీలు తీసుకున్నారు. నెలలు గడిస్తున్నా ఉల్లి డబ్బు మాత్రం ఖాతాలో జమ కాలేదు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు గ్రామీణ బ్యాంకులు విలీనంతో కొత్త బ్యాంక్ ఖాతాలు రావడంతో సమస్య వచ్చిందంటూ రైతులకు అర్థం కాని సమాధానం చెబుతూ వచ్చారు. అక్టోబరు ఆఖరు వరకు కేవలం 350 మంది రైతులకు రూ.2.11 కోట్లు మాత్రమే చెల్లించారు. 2,445 మంది రైతులకు రూ.14.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఉల్లి రైతుల కన్నీటి వ్యథలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. కలెక్టర్ స్పందించి ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీతో మాట్లాడారు. ఎట్టకేలకు రూ.8కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. ఇప్పటికీ 1,100మంది రైతులకు రూ.7కోట్లు చెల్లించాల్సి ఉంది. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- ఉల్లి రైతులకు అందని డబ్బులు
- పెరిగిపోతున్న వడ్డీలు
- రూ.17కోట్లకు గాను చెల్లించింది రూ.10కోట్లే
- మార్క్‌ఫెడ్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ఆందోళనలో అన్నదాతలు

ఉల్లి బోనస్ వచ్చేనా?

భారీ వర్షాలు ఉల్లి రైతులను కష్టాల్లోకి నెట్టేశాయి. ఉల్లిగడ్డలు కుళ్లిపోయి దిగుబడులు తగ్గాయి. ఈసమయంలో ఉల్లి రైతులకు అండగా ఉంటాం.. హెక్టారుకు రూ.50వేలు బోనస్ ఇస్తామని సీఎం చంద్రబాబు, పాలక పెద్దలు ప్రకటించారు. ఉద్యానవన శాఖ అధికారులు 57,700 ఎకరాల్లో ఉల్లి సాగుచేశారని, 35వేల మంది రైతులకు రూ.99.50కోట్లు ఉల్లి బోనస్ చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించారు. బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసి నెలలు గడిచింది. ప్రతిపాదనలు రాష్ట్ర వ్యవసాయ శాఖకు వెళ్లాయి. బోనస్ డబ్బులు మాత్రం విడుదల చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉల్లి బకాయి రూ.7కోట్లతో పాటు బోనస్ డబ్బులు తక్షణమే ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు. ఈవిషయాన్ని ఉద్యానవన శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఉల్లి బోనస్ డబ్బుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొనడం కొసమెరుపు.

ముగిసిన అటల్ స్టింకరింగ్ వర్క్‌షాప్



ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని కింగ్ మార్కెట్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మూడు రోజుల క్రితం ఆరంభమైన అటల్ స్టింకరింగ్ వర్క్‌షాప్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి డీఈవో శామ్యూల్ పాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అటల్ స్టింకరింగ్ ల్యాబ్ నిర్వహణ, విద్యార్థుల ప్రాజెక్టు రూపకల్పన, సేఫ్టీ ప్రమాణాలు, ఎలక్ట్రానిక్ కిట్ల వినియోగం, డాక్యుమెంటేషన్ ప్రాజెక్టు ఆధారిత నేర్పు వంటి అంశాలపై లోతైన శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు టెక్నాలజీ ఆధారిత భవిష్యత్తు దిశగా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శ్రీధర్‌బాబు, ఎంఈవోలు ఈశ్వరమ్మ బాయి, అబ్దుల్ రెహిమాన్, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, అటల్ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా లోక్‌రాజ్



కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా డా.ఎన్‌బీ లోకరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టు గత ఏడాది నుంచి ఖాళీగా ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ ఏపీసీగా బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. రెగ్యులర్ సమగ్రశిక్ష ఏపీసీగా లోక్‌రాజు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో ఈ శాఖలో జరిగే ఉద్యోగులు వివిధ పనులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే వీలుంది. కార్యా లయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు వి.కరుణానిధి మూర్తి, జిల్లా ప్రెసిడెంటు ఎస్‌వీ కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, అసోసియేట్ ప్రెసిడెంటు రమణయ్య ఏపీసీ లోకరాజును కలిసి అభినందనలు తెలియజేశారు.

శ్రీశైలంలో స్కందషష్ఠి వేడుకలు



సుబ్రహ్మణ్యస్వామికి పూర్ణాహుతి సమర్పిస్తున్న ఈవో, అర్చకులు

శ్రీశైలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ స్కందషష్ఠి పర్వదినం సందర్భంగా ప్రధానాలయ ప్రాంగణంలోని ఉపాలయంలో కొలువైఉన్న కుమారస్వామికి బుధవారం షోడశోపచార పూజాక్రతువుల్లో భాగంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. కుమారస్వామి జయంతి సందర్భంగా వేదపండితులు మహా సంకల్పాన్ని పఠించి గణపతిపూజతో ప్రారంభించి సుబ్రహ్మణ్య హోమ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు పరోక్షసేవలో తమ గోత్రనామాలతో పేర్లు నమోదు చేసుకుని స్వామిఅమ్మవార్ల ఆశీస్సులు పొందారు. సాక్షి గణపతిస్వామికి, జ్వాలావీరభద్రస్వామికి అభిషేకాలు అర్చనలు చేశారు.

ఆర్‌యూలో ప్రొఫెసర్లకు పాలనా బాధ్యతలు

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):రాయలసీమ యూనివర్సిటీలో కొందరు ప్రొఫెసర్లకు బాధ్యతలు పాలనాపరమైన అప్పగిస్తూ ఉపకులపతి వి. వెంకట బసవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ ఎన్ టీకే నాయక్‌కు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్, సీవీ క్రిష్ణారెడ్డికి అకడమిక్ డీన్ , సీ విశ్వనాథరెడ్డికి ప్రిన్సిపాల్, చీఫ్ వార్డెన్ , పి. వెంకటసుందరానంద పుచ్చాకు ప్రిన్సిపాల్ సీఈ, అడిషనల్ వార్డెన్‌గా, ఆర్ భరత్ కుమార్‌కు డీన్‌ఆఫ్ అకడమిక్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం



నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, నవంబరు 26, ఆంధ్రజ్యోతి: నగరంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సదరం రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమా ర్, అడిషినల్ ఎస్పీ జి.హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వారు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్‌ఐలు నారాయణ, జావేద్, పోతుల రాజు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం చేయండి

- వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- రైతులు రెండు,మూడు రకాల పంటలు సాగు చేయాలి
- రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సిరి
- పంచ సూత్రాల గురించి వివరించిన కలెక్టర్



ప్రకృతి వ్యవసాయంతో చేసిన రాజకుమారి పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునీ కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రైతులకు సూచించారు. బుధవారం ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సమావేశంలో ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ సహకారం అందించడమేనన్నారు. డిప్ ఇరిగేషన్ చేయడం ద్వారా ఉన్న నీటిన వృథా కాకుండా పొదుపుతో నీటిని వాడుకోవచ్చని, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇతరులకు 90 శాతం సబ్సిడీ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల్లో ఎక్కువ నష్టం ఉండని అన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసిసింగ్, ప్రభుత్వ మద్దతు గురించి వివివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణారెడ్డి, పశుసంవర్థక శాఖ అధికారి హేమంత్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

మహిళా రైతుకు అభినందన

ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రాజకుమారి పొలాన్ని పరిశీలించారు. మొక్కజొన్న రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు సాగిస్తున్న రాజకుమారిని అభినందించారు.

పౌరులు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి



రాజ్యాంగ పీఠికను చదివి వినిపిస్తున్న కలెక్టర్

పౌరులందరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ఉయ్యాలవాడ గ్రామంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో భారత రాజ్యాంగ పీఠికను చదివి కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీశైలంలో ప్లాస్టిక్ వాడితే లైసెన్సు రద్దు: ఈవో

శ్రీశైలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ప్లాస్టిక్ వాడితే వ్యాపారాల లైసెన్స్ రద్దు చేస్తామని ఈవో శ్రీనివాసరావు హెచ్చరించారు. శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో బుధవారం వ్యాపార సంఘాలు, సత్ర నిర్వాహకులు, తోపుడుబండ్ల చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిలిపివేయమని పలుమార్లు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు నిబంధనలు అతిక్రమిస్తున్నారని చెప్పారు. దేవస్థానం నిర్ణీత ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించకుండా ప్లాస్టిక్ వాడకం కొనసాగించే వ్యాపారాల లైసెన్సులను పూర్తిగా రద్దు చేస్తామని ఈవో చెప్పారు. జ్యూట్ బ్యాగులు, బట్ట సంచులు, కాగితం కవర్లు వంటి వాటిని యాత్రికుల అవసరాలకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

కొలనుభారతికి మహర్దశ



- ఆలయ దత్తతకు శ్రీశైల దేవస్థానం సిద్ధం 6
- డిసెంబరులో తమ ఆధీనంలో తీసుకునేందుకు కసరత్తు

రైతును ఆదుకొనే మాంథన్ యోజన

- అవగాహన లేక అవకాశాన్ని కోల్పోతున్న రైతులు
- తక్కువ ప్రీమియంతో వృద్ధాప్యంలో ఆసరా 7

అప్పుడు ఎందుకు అడగలేదు?

- దండలు వేస్తే జిల్లా రాదు.. పోరాడితేనే వస్తుంది..!
- ఆదోని జిల్లా ఏర్పాటుపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి

ఆదోని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన సందర్భంలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని జిల్లా గురించి ఎందుకు పట్టించుకోలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి విమర్శించారు. ఆదోని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భీమాస్ కూడలిలో ఆదోని జిల్లా కోసం జరుగుతున్న రిలే నిరాహారదీక్షల శిబిరాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కె. మీనాక్షినాయుడుతో కలసి తిక్కారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని జిల్లా సాధన కోసం ఆనాడు వైసీపీ నాయకులు పోరాడకుండా నేడు దండలు వేసి, నాలుగు మాటలు మాట్లాడితే జిల్లా ఎలా వస్తుందని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లా విభజన జరిగిన సమయంలో ఆదోని జిల్లా చేయడం ఎంతో సులువుగా ఉండేదన్నారు. ఆ దిశగా అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పట్టించుకోలేదని ఘాటుగా విమర్శించారు. ఆదోని జిల్లా కోసం ఎమ్మెల్యే పార్థసారథి చిత్తశుద్ధితో రాజకీయ పోరాటం చేయాలని, ఈ ప్రాంతం వాసిగా తన సంపూర్ణ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సీఎం చంద్రబాబుకు, మంత్రివర్గ ఉప సంఘానికి వినతి పత్రాలు ఇవ్వకుండా జిల్లా ఎలా వస్తుందని ప్రశ్నించారు. అందరూ కలసి వస్తే... తాను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అపాయింట్‌మెంట్ తీసుకుంటానని తెలిపారు. ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తదితరులు ఇందులో పాల్గొన్నారు.



నిరాహార దీక్షకు మద్దతు ప్రకటిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మీనాక్షినాయుడు, జ్యోతి

కొలనుభారతికి మహర్దశ

- ఆలయ దత్తతకు శ్రీశైల దేవస్థానం సిద్ధం
- క్షేత్ర స్థితిగతులను పరిశీలించిన అధికారుల బృందం
- డిసెంబరులో ఆధీనంలో తీసుకునేందుకు కసరత్తు



కొలనుభారతి క్షేత్రం



ఆత్మకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ పట్టనుంది. ఈక్షేత్రాన్ని శ్రీశైల క్షేత్ర పరిధిలోకి చేర్చి అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలోనే ఈనెల 19వ తేదీన శ్రీశైలంలో జరిగిన ట్రస్టు బోర్డు కమిటీ సమావేశంలో కొలనుభారతి క్షేత్రాన్ని దత్తతకు తీసుకుని అభివృద్ధి చేయాలని తీర్మానించారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైల దేవస్థానం ఆధీనంలోకి తీసుకునేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. తొలుత మూడేళ్ల పాటు కొలనుభారతిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి గడువు పెంచనున్నట్లు తెలిసింది. భక్తులకు కావాల్సిన ప్రాథమిక అవసరాలు, దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆలయంలో జరపాల్సిన పూజలపైకొలనుభారతి ఆలయ అధికారులతో చర్చించినట్లు తెలిసింది. త్వరలో శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు కూడా ఈ ఆలయాన్ని సందర్శించనున్నారు.

వైదిక కమిటీ సూచనల మేరకు..

వైదిక కమిటీ సూచనల మేరకు డిసెంబరులోనే ఒక మంచిరోజును నిర్ణయించి కొలనుభారతిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని శ్రీశైల దేవస్థానం అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆలయ భూములు, వెండి, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను స్వాధీనం చేసుకోనున్నారు. శ్రీశైల దేవస్థానం నుంచి సూపరింటెండెంట్ స్థాయి అధికారితో పాటు సహాయ సిబ్బందిని నియమించనున్నారు. అర్చకులను అందుబాటులో ఉంచి ధూపదీప కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. శ్రీశైలం దేవస్థాన వెబ్‌సైట్‌లో సైతం కొలనుభారతి ఆలయాన్ని చేర్చి అక్కడి అర్జిత సేవలను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు.

అడుగడుగునా అవకతవకలు..

కొలనుభారతి క్షేత్రంలో అడుగడుగునా అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంతకాలం ఈ ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడి పురోహితులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించినట్లు విమర్శలున్నాయి. వసంత పంచమి రోజున ఇక్కడ అక్షరాభ్యాసం సామగ్రి అమ్మకాల పేరిట జరిగే దందా అంతాఇంతా కాదు.



క్షేత్రంలోని సప్తశివాలయాలు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైల దేవస్థానం తరఫున అభివృద్ధి చేసేందుకు నిర్ణయించాం. డిసెంబరు నెలలో వైదిక కమిటీ సూచనల ప్రకారం కొలనుభారతి ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటాం. క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం.

● శ్రీనివాసరావు, ఈవో, శ్రీశైల దేవస్థానం

అభివృద్ధికి కృషి చేస్తాం



టీటీడీ తరుపున ఒంటిమిట్టను ఏవిధంగా అభివృద్ధి చేస్తున్నారో అదే తరహాలో శ్రీశైల దేవస్థానం తరఫున కొలనుభారతి క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తాం. అర్చకులను నియమించి అమ్మవారి ఆలయంలో శాస్త్రబద్ధంగా పూజా క్రతువులు జరిగేలా చొరవ తీసుకుంటాం.

● రమేశ్ నాయుడు, ట్రస్టు బోర్డు చైర్మన్, శ్రీశైల దేవస్థానం

పత్తి రైతులకు అనుకూలంగా వ్యవహరించండి

జేసీ నూరుల్ ఖమర్ ఆదేశం



పత్తి రైతుతో మాట్లాడుతున్న జేసీ నూరుల్ ఖమర్

ఆదోని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారికి అనుకూలంగా వ్యవహరించి పత్తి కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మిల్లు యాజమాన్యాలను కోరారు. జేసీ బుధవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ఐరతులో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అకాల వర్షాల వల్ల రైతులు దాదాపు అన్ని పంటల్లోనూ నష్టపోయారని, అందులో పత్తి కూడా ఉందన్నారు. ఈ విషయాన్ని గ్రహించి ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులను అర్థం చేసుకుని వారి పత్తి పంటను కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను కోరారు.

నిరాకరించిన పత్తి పరిశీలన

కొనుగోలు సందర్భంగా సీసీఐ అధికారులు నిరాకరించిన రంగుమారిన, తేమ చేరిన పత్తిని మిల్లు యాజమాన్యం జేసీకి చూపించింది. సీసీఐ వారు నిరాకరించిన ఈ పత్తిని మిల్లు యజమానులు తప్పకుండా మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయాలని, రైతులను ఏ విధంగానూ ఇబ్బంది పెట్ట వద్దని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ కొండయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ బాబు, మార్కెట్‌యార్డు సెక్రటరీ గోవిందప్ప పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్-2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎలక్టోరల్ అధికారి కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను శిక్షణా కార్యక్రమంలో ఆదేశించారు. బుధవారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లులకు చెందిన ఎస్ఐఆర్-2026 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ రోల్ ప్రకారం ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎలక్టోరల్ రోల్‌తో ఓటర్లను మ్యాపింగ్ చేసుకోవాలని ఇందు కోసం బీఎల్‌వో ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి నిర్ణీత ఫారంలలో ఓటరు వివరాలు సేకరించుకోవాలని అన్నారు. మరణించిన ఓటరు వివరాలు, అందుబాటులో లేని ఓటర్ల వివరాలు నిర్ణీత పారాలలో సేకరించుకుని నోటీసులు అందజేసి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని అందరూ గౌరవించి, అనుసరించాలని డీఆర్వో వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. బుధవారం డీఆర్వో కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం హక్కులు కల్పించిందని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, అనుసరిస్తూ, రాజ్యాంగాన్ని కాపాడుతామని డీఆర్వో అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రకాష్‌బాబు, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో షష్ఠి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాణ్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల మాలధారణ హోమం నిర్వహించి మాల విరమణ చేశారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నాని పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

డాక్టర్ అనూరాధకు గోపాలరత్న అవార్డు

- ఢిల్లీలో కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకున్న చింతకుంట జేవీవో
- జాతీయ స్థాయిలో గోపవరం గోశాలకు గుర్తింపు
- అనూహ్యంగా చేజారిన మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న జూనియర్ వెటర్నరీ అధికారి అనూరాధ

నంద్యాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణ విభాగంలో విశేష సేవలందించిన గోస్పాడు మండలం చింతకుంట జూనియర్ వెటర్నరీ అధికారి (జేవీవో) చాకలి అనూరాధకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ పాల దినోత్సవంలో భాగంగా కేంద్ర పశు సంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా బుధవారం జాతీయ గోపాలరత్న-2025 అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా సేవలందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి ఆమె తెలియజేశారు.

జాతీయ స్థాయిలో గోశాలకు గుర్తింపు

ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం మూడు కేటగిరీల కింద జాతీయ గోపాలరత్న అవార్డులను ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని మహానంది మండలం గోపవరం గ్రామంలో డాక్టర్ ఉదయగిరి శేషఫణి తమ గోశాల.. డెయిరీ ఫామ్ పరంగా.. మూడు కేటగిరిల్లో ఒకటైన ఉత్తమ డెయిరీ ఫార్మర్ విభాగం కింద దరఖాస్తు చేశారు. అయితే దేశ వ్యాప్తంగా ఇదే అవార్డుకు సుమారు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాతీయ స్థాయిలో మొదటి 20 ఉత్తమ డెయిరీ ఫార్మర్స్‌ను ఎంపిక చేశారు. ఈ 20 మందిలో ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం డాక్టర్ ఉదయగిరి శేషఫణి మాత్రమే ఉన్నారు. ఎన్‌డీడీబీ ఆఫీసర్లు సదరు 20 ఉత్తమ డైరీ ఫార్మర్స్ క్షేత్రస్థాయిలో ఆయా వారి గోశాల, డైరీ ఫాంలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా వాటికి సంబంధించిన సమగ్ర నివేదికలను ఇటీవల డీఏహెచ్‌డీ (డిపార్ట్‌మెంట్ అనిమల్ హస్బెండరీ అండ్ డెయిరీంగ్)కు అందజేశారు.

అనూహ్యంగా చేజారిన అవార్డు

మొదటి మూడు అవార్డులకు ముగ్గుర్ని ఎంపిక చేయడంలో అనూహ్యమైన నిర్ణయం తీసుకోవడంతో డాక్టర్ ఉదయగిరి శేషఫణికి అవార్డు చేజారినట్లైంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బ్రీడ్ మల్టిప్లికేషన్ ఫామ్(బీఎంఎఫ్) లబ్ధిదారులను సదరు అవార్డులకు అర్హులు కాదని చివరి సమయంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో డాక్టర్ ఉదయగిరి శేషఫణి సదరు బీఎంఎఫ్ లబ్ధిదారుడు కావడంతో అవార్డు జాబితాలో నుంచి వైదొలిగినట్లైంది. దీంతో ఏపీకి చెందిన డాక్టర్‌కు జాతీయ స్థాయిలో గోపాలరత్న అవార్డు చేజారినట్లైంది.

వర్చువల్‌గా 9 బీఎంఎఫ్‌ల ప్రాజెక్టుల ప్రారంభోత్సవం...

జాతీయ పాల దినోత్సవంలో భాగంగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతులు చేతులు మీదుగా బుధవారం వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 100శాతం పూర్తయిన 9 బీఎంఎఫ్‌ల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో రెండు బీఎంఎఫ్‌లను ప్రారంభించడమైంది. ఇందులో గోపవరానికి చెందిన డాక్టర్ ఉదయగిరి శేషఫణి, విజయవాడకు చెందిన రాజీవ్‌కు చెందిన బీఎంఎఫ్‌లకు అవకాశం దక్కినట్లైంది. ఇదిలా ఉండగా.. బీఎంఎఫ్ సబ్సిడీ నిబంధన అమలు చేయకపోతే.. డాక్టర్ ఉదయగిరి శేషఫణి జాతీయ గోపాలరత్న అవార్డు లభించేదని అభిప్రాయం వారి వ్యక్తమైంది.

బీఎంఎఫ్ డెయిరీ రైతులకు వరం..



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీఎంఎఫ్ సబ్సిడీ డెయిరీ రైతులకు వరం లాంటింది. అధిక పాలు ఇచ్చే పశువులను పెంపొందించుకోవచ్చు. జాతీయ గోపాలరత్న అవార్డు కూడా చివరి సమయంలో మాకు చేజారినట్లయింది.

-డాక్టర్ ఉదయగిరి శేషఫణి

యువత సామర్థ్యాలను పెంచేలా మాక్ అసెంబ్లీ

- నంద్యాల జిల్లా పాల్గొన్న ఏడుగురు విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువ సామర్థ్యాలను పెంచేలా మాక్ అసెంబ్లీ నిర్వహించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మాక్ అసెంబ్లీలో నంద్యాల జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రిగా నంద్యాల వైఎస్ఆర్‌నగర్ మున్సిపల్ ఉర్దూ పాఠశాల విద్యార్థి మహ్మద్‌నూరుల్లా వ్యవహరించారు. పాణ్యం ఎమ్మెల్యేగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని అమృతబోస్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ఏపీఎంఎస్ విద్యార్థి భరత్‌కుమార్, ఆత్మకూరు ఎమ్మెల్యేగా వెంకటాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజశేఖర్, నందికొట్కూరు ఎమ్మెల్యేగా పగిడ్యాల మండలం లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థిని సుగుణ, బనగానపల్లె ఎమ్మెల్యేగా జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వర్షిత, డోన్ ఎమ్మెల్యేగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థి సుసన్న వ్యవహరించారు. తమకు ముఖ్యమంత్రిని దగ్గరగా చూసే అవకాశం రావడం, అసెంబ్లీ ఏ విధంగా నడుస్తుందో ప్రత్యక్షంగా చూడడంతో తాము కూడా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యులం అయ్యేవిధంగా స్ఫూర్తి నింపారని విద్యార్థులు కొనియాడారు.



నంద్యాల జిల్లా నుంచి మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

మాక్ అసెంబ్లీలో కర్నూలు విద్యార్థులు

ఆలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కర్నూలు జిల్లా నుంచి 7 అసెంబ్లీ స్థానాల నుంచి 7 మంది విద్యార్థులతో పాటు అదనంగా మరో విద్యార్థిని విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మాక్ అసెంబ్లీలో కర్నూలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని డయానా ప్రతిపక్ష హోదాలో కేంద్రం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకంలో క్షేత్రస్థాయిలో జరిగే వైఫల్యాలను ఎండగడుతూ మాక్ అసెంబ్లీలో మాట్లాడారు. అలాగే వెల్దుర్తి డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థిని సి.గాయత్రి రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రిగా మాక్ అసెంబ్లీలో అంగన్‌వాడీల పనితీరుపై ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పథకాలపై స్పష్టంగా వివరించారు. సి.బెళగల్ హైస్కూల్ లోకేశ్వర్‌రెడ్డి స్పీకర్ ఎంపికకు ప్రతిపాదన చేసిన వ్యక్తిగా వ్యవహరించారు. అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థి పీజీ సాయిమహీధర్ వ్యవహరించారు. విద్యార్థులు రాజకీయ ప్రభుత్వ పరిపాలన, చట్టాలు, పథకాల అమలుపై విద్యార్థులు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మాక్ అసెంబ్లీని నిర్వహించడం అభినందనీయమని, ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మాక్ అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం కల్పించడం అభినదనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, గైడ్ టీచర్స్ సుధాకర్‌బాబు, భవానీ తెలిపారు.



మాక్ అసెంబ్లీకి వెళ్లిన కర్నూలు జిల్లా విద్యార్థులు

ఆ చట్టాలను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి నష్టం కల్గించే నాలుగు చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, ఏసురత్నం డిమాండు చేశారు. బుధవారం పట్టణంలోని కోవెలకుంట్ల జంక్షన్ వద్ద కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు పదర్శన కొనసాగించి అనంతరం డీఆర్వో రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత ఐదు ఏళ్లుగా డిల్లీలో రైతులందరూ ఆందోళన చేయగా ఆ చట్టాలను రద్దు చేస్తామని రైతులకు పండించిన పంట గిట్టుబాట ధర, కల్పిస్తామని, విద్యుత్తు డిస్కంలు ప్రైవేటీకరణ ఆపేస్తామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబా ఫకృద్దీన్, లక్ష్మణ్, గౌస్, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సీఎంవో పూజలు



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న సీఎంవో డాక్టర్ శాంతిరామ్

మహానంది, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి రామ్ బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయం ముఖ ద్వారం వద్ద వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం సీఎంవో ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అభిషేకార్చన పూజలను జరిపారు. కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌టీ ఆర్‌ఐ యనిషి శర్మ, కన్సల్టెంట్ సత్యవతి, డీపీఎంవో డీవీ రమణ, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిపోర్టుల కోసం పాట్లు



న్యూడయాగ్నస్టిక్ బ్లాక్‌లో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రిపోర్టుల కోసం బారులు తీరిన రోగులు, సహాయకులు

ఈ ఫొటోను చూశారా.. సినిమా టికెట్ల కోసం జనం ఎగబడుతున్నట్లు ఉంది కదూ..! కానే కాదు.. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వ్యాధి నిర్ధారణ పరీక్షల రిపోర్టులు తీసుకుంటున్న దృశ్యం. కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిరోజు ఏడు జిల్లాల నుంచి 3వేల నుంచి 3,500 మంది రోగులు ఓపీ కోసం వస్తుంటారు. ఇందులో 2వేలు మంది రోగులు ఉదయం వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఆ పరీక్షల రిపోర్టులు ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటలకు న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రోగులు, ఆయా సహాయకులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఒక పద్ధతి లేకుండా కొత్త సినిమా టికెట్లు బ్లాక్‌లో అమ్ముతున్న విధంగా పరీక్షల రిపోర్టులను ఆయా రోగులకు సిబ్బంది అందజేస్తారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పంపిణీ చేయడంతో ఓపీ రోగులు ఆందోళన చెందారు. కొత్త కలెక్టర్ అయిన ఈ సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

● కర్నూలు హాస్పిటల్, ఆంధ్రజ్యోతి

స్పోర్ట్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

పాణ్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ గిరిజన గురుకుల స్పోర్ట్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ మేరీసలోమి తెలిపారు. బుధవారం ఆమె విలేకరు లతో మాట్లాడారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి 6 వతరగతిలో ప్రవే శానికి, 7, 8, 9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయను న్నామ న్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గిరిజన గురుకుల, ప్రభుత్వ, ఆశ్రమ, మినీ గురుకుల పాఠశాలల్లో చదివే ఎస్టీ విద్యార్థినులకు క్రీడా విభాగం ద్వారా ఎంపిక చేస్తారని అన్నారు. 28 వతేదీన ఎంపిక పోటీలు జరుగుతాయని, ఆరు నుంచి తొమ్మిది తరగతుల వరకు చదివే గిరిజన బాలికలు మాత్రమే అర్హుల న్నారు. 6 వతరగతిలో 30 సీట్లు, 7 వతరగతిలో 30, 8వ తరగతిలో 26, 9వతరగతిలో 23 ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు 7337278997, 9989647238, నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఆ విత్తన కంపెనీని సీజ్ చేయాలి

- నకిలీ వరి విత్తనాలు అంటగట్టిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలి
- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో నకిలీ వరి విత్తనాలు సరఫరా చేస్తున్న కంపె నీని సీజ్ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్‌పై కఠిన చర్యలు తీసుకో వాలని బుధవారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి రామకృష్ణ ఆధ్వ ర్యంలో రైతులు దుకాణం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తు న్నారని, కంపెనీ యజమానులు డీలర్లతో లాలూచి పడి వారిచ్చిన ముడుపులతో సర్దుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, నిడ్జూరు మాజీ సర్పంచ్ కృష్ణతో పాటు వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, శ్రీనివాసులు, అయ్యస్వామి, సోమశేఖర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.


విత్తన దుకాణం వద్ద రైతుల నిరసన

పెట్రోలు పంపును ఢీకొట్టిన ట్రాక్టరు

- తప్పిన పెను ప్రమాదం

రుద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామంలో బుధవారం లక్ష్మీనరసింహ పెట్రోలు బంకులో పెట్రోలు పంపును ట్రాక్టరు ఢీకొంది. ట్రాక్టరు డీజిల్ కోసం పెట్రోలు బంకుకు డ్రైవరు తీసుకెళ్లాడు. డ్రైవరు లోబీపీకి గురి కావడంతో ఒక్కసారిగా ట్రాక్టరు పెట్రోలు పంపును ఢీకొంది. పెట్రోలు కోసం వచ్చిన వాహనదారులు వాహ నాలు వదిలేసి పరు గులు తీశారు. ఎక్కడ పెట్రోలు పంపు పేలు తుందోనని భయభ్రాం తులకు గురయ్యారు. ట్రాక్టరును తొలగించి పెట్రోలు లీక్ కాకుండా చూడడంతో ప్రమాదం తప్పింది.


పెట్రోలు పంపును ఢీకొట్టిన ట్రాక్టరు

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్ల పాడులో గొర్రెల మందపై బుధవారం కుక్కలు దాడి చేశాయి. ఈదా డిలో 15 గొర్రెలు మృతి చెందగా మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మద్దూరుకి చెందిన నాగేంద్ర సుమారు 100 గొర్రెలను నగల్లపాడు గ్రామ శివారులో మేపు కుంటున్నాడు. గొర్రెల మందపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. మందలోని 10 గొర్రెలు, 5 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో 15 గొర్రెలు గాయపడ్డాయి. పశువైద్యాధికారి రవీంద్రారెడ్డి, సిబ్బంది అక్కడికి చేరు కొని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. గాయపడ్డ గొర్రెలకు చికిత్సలు చేశారు. పశుబీమా ద్వారా సాయమందించి ఆదుకోవాలని బాధితుడు నాగేంద్ర కోరారు.


గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యుడు

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- ఉమ్మడి జిల్లా అధ్యక్షులకు సహకరిస్తా
- తప్పుడు ప్రచారాలను నమ్మకండి
- ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీ నరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను గెలి పించి, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యంగా పని చేస్తానని ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు కాంగ్రెస్ ఇన్‌చార్జి జె. లక్ష్మీనరసింహయా దవ్ అన్నారు. బుధవారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎంపికయ్యే వారికి తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని తెలిపారు. పార్టీ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించి పార్టీకి అండగా నిలవాలనే లక్ష్యంతో పని చేస్తున్నానని తెలిపారు.

హైదరాబాదులో నకిలీ ఐపీఎస్ అధికారి అరెస్టు

- అతడిపై కర్నూలులోనూ పలు ఫిర్యాదులు

కర్నూలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో అరెస్టయిన నకిలీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారి శశికాంత్‌పై కర్నూలులోనూ పలు ఫిర్యాదులు ఉన్నాయి. నందికొట్కూరు చెందిన అతడు కర్నూలు సంతోష్‌నగర్‌లో నివాసముండే సమయంలో ఇక్కడ కూడా ఐపీఎస్ అధికారిగా చలామణి అయ్యాడు. కర్నూలు చెందిన ఓ మహిళ కలర్ ల్యాబ్ నిర్వహిస్తోంది. ఆమెకు సంబంధించిన ల్యాబ్‌కు లోన్ చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ల్యాబ్‌ను తెరిపిస్తానని ఆ మహిళ నుంచి సుమారు రూ.13 లక్షల మేర నకిలీ ఐపీఎస్ అధికారి తీసుకుని మోసం చేసి ముఖం చాటేశాడు. బుధవారం హైదరాబాదులో అతడు పట్టుబడ్డాడు. మరోసారి వెలుగులోకి వచ్చింది.

రైతును ఆదుకొనే మాంధన్ యోజన

- అవగాహన లేక అవకాశాన్ని కోల్పోతున్న రైతులు
- తక్కువ ప్రీమియంతో వృద్ధాప్యంలో ఆసరా
- ప్రచారంలోకి రాని కేంద్ర ప్రభుత్వ పథకం



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదరణ కోల్పోయి, వృద్ధాప్యంలో కష్టాల్లో ఉన్న రైతులకు అండగా ఉండటానికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాంధన్ యోజన పథకం తెచ్చింది. అయితే ఈ పథకం గురించి రైతులకు పెద్దగా తెలియదు. చెప్పే వాళ్లు లేరు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బందిగానీ, వారానికో, నెలకో గ్రామాలకు వెళ్లే వ్యవసాయ శాఖ అధికారులుగానీ ఈ పథకం గురించి రైతులకు చెబుతున్న పాపాన పోవడం లేదు. రైతులకు ఉపయోగపడే ఈ పథకం గురించి వ్యవసాయ శాఖ అధికారులే గాకుండా అన్ని విభాగాల అధికారులు రైతులకు తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తుండగా.. ప్రస్తుతం కేంద్రం ప్రత్యేకంగా కష్టాల్లో రైతుల కోసం ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది.

ప్రీమియం నామ మాత్రమే..

రైతులు తమ వయస్సును బట్టి ప్రతి నెలా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించే వెసలుబాటు ఈ పథకం ద్వారా కల్పించబడింది. దీనికి సమానంగా కేంద్ర ప్రభుత్వం అంతే మొత్తాన్ని జమ చేస్తుంది. 60 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లిస్తే.. ఆ తర్వాత ప్రతి నెలా రైతులకు రూ.3వేల పింఛన్ అందుతుంది. రైతు మరణించిన పక్షంలో భార్య లేదా నామినీకి నెలకు రూ.1,500 సాయం అందజేస్తారు. ఈ పథకంలో లబ్ధి పొందాలనుకునే రైతులు తమ గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల ద్వారా కానీ, పీఎం కిసాన్ పోర్టల్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ నెంబర్, నామినీ, రైతు బ్యాంకు ఖాతా తదితర వివరాలను అప్‌లోడు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పింఛన్‌కార్డు జారీ అవుతుంది. ఆ తర్వాత రైతు ప్రతి నెలా తమకు నిర్దేశించిన ప్రీమియాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేయాలి.

ఐదెకరాల్లోపు రైతులే అర్హులు

ఈ పథకానికి 40 ఏళ్లలోపు, ఐదెకరాల్లో వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులే ఈ పథకానికి అర్హులు. భూరికార్డుల్లో పేరుండాలి. రైతు నిర్ణీత ప్రీమియం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే నేషనల్ పెన్షన్ స్కీమ్, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో చేరిన వారు పథకానికి అనర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఆర్థిక స్థోమత ఉన్న వారు, ఇతర సామాజిక భద్రతా పథకాలను పొందుతున్న రైతులకు ఈ పథకం వర్తించదు.

రైతులందరూ ఉపయోగించుకోవాలి



కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల్లో ఈ పథకం ఎంతో ప్రయోజకరమైంది. రైతులకు వయసు మళ్లాక, ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఈ పథకం కాపాడుతుంది. ప్రతి రైతు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని కేంద్ర ప్రభుత్వం తక్కువ ప్రీమియం చెల్లించేలా ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. **- వరలక్ష్మి, జేడీ**

రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పిస్తాం

- కలెక్టర్ రాజకుమారి
- విజేతలకు బహుమతులు అందజేత


విద్యార్థులతో నంద్యాల కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో విద్యార్థులకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమె విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి నియోజక వర్గం నుంచి మొత్తం ముగ్గురు విద్యార్థులను ఉత్తమ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన ఓ ఉత్తమ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు, ప్రశంసాపత్రం పొందగా మిగిలిన ఇద్దరు విద్యార్థులకు జిల్లా స్థాయిలోనే అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు.

కప్పట్రాళ్ల విద్యార్థినికి సన్మానం

కర్నూలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల గ్రామంలోని పేద విద్యార్థిని (షైమూన్) మొదటి విడతలోనే తిరుపతి లోని వెంకటేశ్వర అగ్రికల్చర్ కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో అర్హత సాధించింది. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్త తీసుకున్న నాటి ఎస్పీ, ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ఏపీ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి డా.డి.ప్రవీణ్ బుధవారం గుంటూరులో సన్మానించి అభినందించారు. ఆకే రవికృష్ణ సహకారంతో నిరంతరం ప్రోత్సాహం, సలహాలు, సూచనలు పాటిం చడం ద్వారా ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధ్యమైందని విద్యార్థిని షైమూన్ తెలిపారు. తానా బోర్డు ఆఫ్ డైరెక్టర్ పోట్లూరి రవి విద్యార్థిని షైమూ న్‌ను ఫీజులు కట్టి ఇంటర్ చదివించారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో మంచి మార్కులతో షైమూన్ ఉత్తీర్ణత సాధించారు. ఈ ట్రస్టు కప్పట్రాళ్ల గ్రామంలోని 5 మంది విద్యార్థులకు ఫీజులు కట్టి చదివిస్తున్నారు. ఏవో అక్బర్ బాషా, విద్యార్థిని తల్లి పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న రవికృష్ణ

వెటర్నరీ కౌన్సిల్ నిర్ణయం బాధాకరం

- మార్చుకోకుంటే భారీ ఎత్తున ఆందోళన
- జేడీకి వినతి పత్రం అందించిన ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ కేడర్లను అవమానిస్తూ వెటర్నరీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం తమకు తీవ్ర అసంతృప్తిని, ఆవే దనను మిగిల్చిందని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నిరియన్స్ ఫెడరేష న్ జిల్లా చైర్మన్ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖలో వెట ర్నరీ పదం తమ క్యాడర్లు వాడకూడదని, వాడే అర్హత లేదని ప్రభు త్వాన్ని తప్పుదోవ పట్టించేలా పత్రికా ప్రకటనలు ఇస్తున్న రాష్ట్ర వెట ర్నరీ కౌన్సిల్ చైర్మన్ డా. పీవీ లక్ష్మయ్యపై చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎం చంద్రబాబుకు లేఖలు రాశామని వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పశుసంవర్ధకశాఖ జేడీకి వినతి పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణలో శాఖా సహాయకులను నియమించా రని, ఇప్పుడు వారివి దొంగ సర్టిఫికెట్లు అంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం విచారణ కమిటీ వేసి తప్పు చేసిన అధికారులందరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు. లైఫ్ స్టాక్ అసిస్టెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, వీఎల్‌వో వైస్ ప్రెసిడెంటు జనార్దన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎంసీ గంగన్న, ఎల్ఎస్ఏ అసోసియేషన్ కార్యదర్శి ఆయేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తలూరు గ్రామానికి చెందిన వెంకటయ్య, మహేశ్వరరెడ్డిలు ట్రాక్టలో చాగలమర్రికి వస్తుండగా చింతకొమ్మదిన్నె జాతీయ రహదారిపై లారీ అతి వేగంగా వచ్చి ట్రాక్టర్ వెనుక వైపు ఢీకొంది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న మహేశ్వరరెడ్డి, వెంకటయ్యలకు తీవ్ర గాయలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై తల్లీ కూతుళ్లకు గాయాలు

కర్నూలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌలిగేరిలో గ్యాస్ లీకై మంటలు చెలరేగి శశికళ, ఆమె కూతురు మౌనికలకు తీవ్ర గాయాలయ్యాయి. శశికళ ఇద్దరు కూతుళ్లు ఆడుకుంటూ గ్యాస్ పైపును పీకేశారు. దీంతో ఇంట్లో గ్యాస్ వ్యాపించి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తల్లి శశికళతో పాటు కూతురు మౌనికకు గాయాలయ్యాయి. వీరిద్దరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చీటింగ్ కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోర్ సూపర్ మార్కెట్‌లో అవకతవకలు జరిగాయని ఏరియా మేనేజర్ సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ స్టోరులో శేఖర్ అనే మేనేజర్ గత కొద్ది కాలంగా పని చేస్తున్నారనీ, నగదు లావాదేవీల్లో మోసాలకు పాల్పడ్డాడనీ, తాము నిర్దేశించిన కిరాణం సరుకులు కాకుండా మిగతా సరుకులు విక్రయించి సొమ్ము చేసుకున్నాడనీ ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. కొన్ని నెలలుగా రూ.21 లక్షల మేర లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి రగ్బీ జట్టు ఇదే

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జనవరి2026లో ఢిల్లీలో నిర్వహించే 69వ జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు హాజరయ్యే రాష్ట్ర జట్లను జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి రాఘవేంద్ర ప్రకటించారు.

బాలుర జట్టు: శశిరాజు, ఆర్‌యు మనోజ్ కుమార్, శివయ్య (నెల్లూరు), సురేష్, ఎం.నాగన్న (కర్నూలు), గణేష్ (శ్రీకాకుళం), ఎస్.చరణ్ తేజ (చిత్తూరు), ఎం.జశ్వంత్ (ఈస్ట్ గోదావరి), బి.దుర్గాప్రసాద్ (కడప), ఎం.కౌశిక్ (గుంటూరు), తేజ (ప్రకాశం), శివధనుష్ రెడ్డి (కడప), ఎంపికయ్యారు.

బాలికల జట్టు: పి.సునంద తేజశ్రీ, లక్ష్మి గంగాభవానీ (ఈస్ట్ గోదావరి), వీర నారక్క, లాసీయా ప్రియ (అనంతపురం), కే.విశాలాక్షి, షకీన్ (కర్నూలు), సుస్మిత (గుంటూరు), జి.సాక్షి (ప్రకాశం), షాలినీ (శ్రీకాకుళం), పవిత్ర (నెల్లూరు), నందిని (కృష్ణా), హేమశ్రీ (కడప) ఎంపికయ్యారు.

క్రీడల అభివృద్ధికి సహకరించాలి

- కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలులో క్రీడల అభివృద్ధికి సహకరిం చాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ్యాన్ కలిసి ఓ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ రాయలసీమకు ప్రధాన ప్రాంతీయ కేంద్రంగా, రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, విద్యా కేంద్రంగా ఉన్న కర్నూలు, క్రీడా నైపుణ్య సమూహంగా మారడానికి బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. ఖేల్ ఇండియా కింద కర్నూలు జిల్లాలకు క్రీడా సామగ్రి సంబంధిత ప్రక్రియకు రూ.45.16 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని మంత్రి కోరారు. ఇండోర్ స్పోర్ట్స్ హాల్స్, సింథటిక్స్ అథ్లెటిక్ ట్రాక్, ఫుట్ బాల్ టర్ఫ్, స్క్వాష్ కోర్ట్ అవసరమన్నారు. ఈ సౌకర్యాలు యువత ప్రతిభను పెంపొందించమే కాకుండా, స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తాయని, యువతకు బలమైన క్రీడా పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తాయన్నారు. వీటన్నింటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి పేర్కొన్నారు.


కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కమనీయం.. సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని జమ్మిచెట్టు వద్ద లలితా పీఠంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా బుధవారం వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. హిందూ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. అనంతరం స్వా మి, అమ్మవార్ల రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులకు అన్నదానం

సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంచాలి

- నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్


పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సునీల్ షెరాన్ అధికారులను సూచించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు కూడా ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. జిల్లాలో నేర నియంత్రణకు తీసుకోవాల్సిన శాంతి భద్రతల పట్ల ప్రాధాన్యత క్రమంలో వివరించారు. ప్రస్తుతం కేసుల్లో నిందితుల అరెస్టు, కేసు దర్యాప్తు విషయాలు వాటి పురోగతిపై ఆరా తీశారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించి నేరగాళ్లను ఎలా పట్టుకోవాలో సూచనలు ఇచ్చారు. మర్డర్, సైబర్, మిస్సింగ్, ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నేర చరిత్ర, రౌడీ షీటర్లు, అనుమాతులను ఎప్పటికప్పుడు వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే కేసుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మందా జావళి, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎస్పీలు ప్రమోద్‌కుమార్, రామాంజినాయక్, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 4వ తేదీన జార్జియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు నారాయణ పాఠశాల 2వ తరగతి విద్యార్థిని ఎం.నిత్యశ్రీ ఎంపికైందని క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ బాషా తెలిపారు. బుధవారం మాధవనగర్‌లోని పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుందన్నారు. గణితం కష్టమైనదని, ప్రతి విద్యార్థికి అపోహలు ఉంటాయనీ కానీ అబాకస్ ద్వారా కూడిక, తీసివేత, గుణహారం, భాగహారం సులువుగా చేయవచ్చన్నారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతే రాజు అన్నదే ప్రభుత్వ విధానం



మీకోసం రైతన్నలో పాల్గొన్న ఎమ్మెల్యే దస్తగిరి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతే రాజు అన్నదే టీడీపీ ప్రభుత్వ నినాదమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం చనుగొండ్ల గ్రామంలో రైతన్న మీకోసం'లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. 17 నెలల్లో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కలిపి రూ.6.310 కోట్లను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు జె.సురేష్, మండల వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే జైలుకే..



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొడుమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాగి వాహనాన్ని నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు, జైలుకు పంపుతామని ఎస్ఐ డివై.స్వామి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డులు పాండు, సుంకన్న ఉన్నారు.

చిన్న మొత్తాలతో పొదుపు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్న మొత్తాలతో పొదుపు చేయడం మహిళలు అలవరచుకోవాలని నెగ్జాన్ వెల్త్ కలెక్టివ్ వ్యవస్థాపకుడు, రీసెర్చ్ అనలిస్టు క్రాంతిరాజ్ సూచించారు. బుధవారం నగర శివార్లలోని అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మాస్టర్ యువర్ మైండ్స్-హెల్త్ సేవింగ్ అండ్ స్మార్ట్ ఇన్వెస్టింగ్ ఫర్ యంగ్ ఉమెన్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు.ఆర్థిక విషయాలు కేవలం వాణిజ్యానికే కాకుండా ప్రతి మహిళకు జీవిత నైపుణ్యాన్ని ఇస్తాయన్నారు. సీఈవో డా.హరీష్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర పాలక ఏఈకి పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఏఈ ఆర్.భానుప్రతాప్‌కు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా తాత్కాలిక పదోన్నతి లభించింది. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భాను ప్రతాప్‌ను విజయవాడ టిడ్కోకు కేటాయించారు. త్వరలోనే ఇక్కడ నుంచి రిలవ్ అవుతారని అధికారులు తెలిపారు.

అభివృద్ధికి దూరం



చిత్రంలో కనిపిస్తున్నది ఎర్రగుంట కొట్టాల గ్రామం. 278 జనాభా ఉండగా, అందరూ వ్యవసాయ కూలీలే. గ్రామానికి నేటికీ రహదారి కూడా సరిగా లేదు. గ్రామంలో చాలామంది పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకున్నా, అవి మంజూరు కాలేదు. అలాగే మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

- సి. బెళగల్ మండలం మజరా గ్రామాల్లో ప్రజల అవస్థలు..
- సీసీ రోడ్లు, డ్రైనేజీ లేదు, ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు.. నిధులు ఇవ్వని పంచాయతీలు

సి. బెళగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజరా గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు 300లోపు జనాభాగల గ్రామాలను సమీప గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేస్తారు. మొత్తం 18 పంచాయతీలు ఉండగా, మొత్తం నాలుగు మజరా గ్రామాలు ఉన్నాయి. ఎర్రగుంటకొట్టాల, క్రిష్ణదొడ్డి, బ్యాధోళి పల్‌దొడ్డి గ్రామాలను మజరా గ్రామాలుగా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక నిధులు లేక అవస్థలు..

ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తుంది. మజరా గ్రామాలకు ప్రత్యేక నిదులంటూ ఉండవు. దీంతో పంచాయతీ వారు దయతిలిస్తేనే మజరా గ్రామాల్లో పనులు నిర్వహించేందుకు వీలుంటుంది. అయితే మండలంలోని మజరా గ్రామాలను అనుసంధానం చేసిన పంచాయతీల వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు..

గ్రామంలో వేసిన బోర్లలో ఫ్లోరైడ్ నీరు ఉండటంతో ఇవి తాగేందుకు పనికిరావు. దీంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తోంది. ప్రభుత్వ అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామాన్ని పట్టించుకోవడం లేదు

మాది మజరా గ్రామం కావడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే నిధులు కొరత ఉందంటున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు కూడా లేవు. **- నాగమద్దిలేటి, ఎర్రగుంట కొట్టాల మజరా, బ్రాహ్మణదొడ్డి పంచాయతీ**



సమస్యలను పరిష్కరిస్తాం

మండలంలో 2 పంచాయతీలు కొత్తగా ఏర్పడటంతో మజరా గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయి. వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయించి, సమస్యలను పరిష్కరిస్తాం. **- మహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో, సి.బెళగల్**

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

- నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణకు



చర్యలు తీసుకోవాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వాథ్ ఆదేశించారు. బుధవారం పారిశుధ్య సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కమిటీలో చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా కమిషనర్, డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ సెంటర్, కార్మిక శాఖ, తూనికలు అండ్ కొలతలు, కాలుష్యనియంత్రణ మండలి, సీపెట్, మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. కమిటీ ప్రతి నెలా సమావేశమై సమీక్షించి తదనుగుణంగా అమలు చర్యలు తీసుకుంటుందని వివరించారు.

ప్రపంచంలోనే ఉత్తమ రాజ్యాంగం

- కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో రాజ్యాంగ దినోత్సవం
- విద్యాసంస్థలు, కార్యాలయాల్లో అంబేడ్కర్‌కు నివాళి



జడ్పీలో నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఈవో, సిబ్బంది



దిన్నెదేవరపాడు గురుకులంలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో..

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పరిపాలన భవనంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అధికారులు సరస్వతమ్మ, సి.రాంగోపాల్, బసవశేఖర్, మహ్మద్ హక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ క్రాంతికుమార్, సూపరింటేండెంట్ రామక్రిష్ణ, మంజూర్‌బాషా, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

● పాతబస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం నాయకులు పీఎస్. రాధాక్రిష్ణ జి.రామక్రిష్ణ, టి. రాముడు నివాళి అర్పించారు. కేటీపీఎస్ నాయకులు ఎండి. ఆనంద్‌బాబు కరుణాకర్, ఎన్‌జి. కృష్ణ, రోశయ్య, బాబురావు, స్టాలిన్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగం దేశానికే తలమానికమని ప్రిన్సిపాల్ నిర్మల అన్నారు. దిన్నెదేవరపాడు అంబేద్కర్ గురుకులంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డీసీవో శ్రీదేవి పాల్గొన్నారు. ఎ.క్యాంపు మెపర్ ఫార్మసీ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి చైర్మన్ ఆదిమూలపు సతీష్ నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నవ్యాంధ్ర జేఏసీ అధ్యక్షుడు ఆవుల అయ్యస్వామి, డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర



నగరంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల నివాళి

కార్యదర్శి శరత్, రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు. బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్ కేవీఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు రమేష్ , అధ్యాపకులు చిన్న మల్లేశ్వరుడు పాల్గొన్నారు.

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్: భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షక ఇంజనీర్ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం కార్యాలయంలో 76వ జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. వీరేంద్రకుమార్, లక్ష్మీనారాయణ, నరసింహులు, కిషోర్‌రెడ్డి, సుధాకర్, నారాయణరావు పాల్గొన్నారు.

కొడుమూరు: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్ర పటానికి హెచ్ఎం రామచంద్రుడు నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు తిరుమలరెడ్డి, జరీనాబేగం, ప్రసన్నజ్యోతి, ఉస్మాన్ సాహెబ్, అనిత, కృష్ణమోహన్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: అంబేద్కర్ భవన్‌లో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నగర ఉపాధ్యక్షుడు కాశపోగు ఏసన్న నివాళి అర్పించారు. పోతురాజు శివ, బాస్కర్ రావు, రవికుమార్, ప్రకాష్, కిరణ్, సతనయేలు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. ఉర్దూ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వీసీ షావలి ఖాన్ రిజిస్ట్రార్ లోక్ నాథ్ నివాళి అర్పించారు. ఆర్‌యూ అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఆర్పీఎస్ఎఫ్ నాయకు లు అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. శరత్ కుమార్, నాగరాజు, నాగార్జున, రాజేష్, అశోక్, మధు నాయక్, కిరణ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ దేశ పౌరులంతా రాజ్యంగ ప్రకారం నడుచుకొవాలన్నారు.

ఓర్వకల్లు: నన్నూరు, ఓర్వకల్లు, ఉయ్యాలవాడ, హుశేనాపురం, శకునాల గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. హెచ్ఎం నిర్మల వసంత కుమారి, లక్ష్మీనారాయణ, శ్యామలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు రూరల్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ ప్రధాన కార్యదర్శులు మునెప్ప, అంజిబాబు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో కలిసి కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ధర్నా చేశారు. కార్పొరేట్లకు దేశ సంపద పంచుతూ కార్మికులు, రైతుల నడ్డి విడుస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అంతకముందు ఆర్ఎస్ రోడ్డునుంచి రైతులతో ప్రదర్శన నిర్వహించి రైల్వేస్టేషన్ ఎదుట ధర్న చేశారు. లెనిన్‌బాబు, వెంకటేష్, రామాంజనేయులు, బతుకన్న, నాగన్న,పంపన్నగౌడ్, రామకృష్ణ, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

కర్నూలు అర్బన్: రైతు కార్మిక హక్కులను హరిస్తున్న నల్ల చట్టాలను రద్దు చేయాలని కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ రోడ్డు నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బ్రతుకన్న, కే. రామేవేంద్రరెడ్డి, రేపల్లే ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహం



ప్రశంసా పత్రాలు ఇస్తున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. బుధవారం డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో పారా ఒలంపిక్స్ జిల్లా విభిన్నవంతుల క్రీడల ఎంపిక నిర్వహిం చారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదరించి, ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమ న్నారు. త్రోబాల్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలను డీఈవో జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు అతిథులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈవో-2 అబ్దుల్ రెహిమాన్, పారా ఒలంపిక్స్ అధ్యక్షుడు ఎల్లప్ప, ఐఈఆర్‌పీ ఎన్.సురేంద్ర బాహూజీ, 180 మంది ప్రత్యేక అవసరాలు గల ప్రతిభావం తులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 69వ జాతీయ స్థాయి



విద్యార్థినితో ప్రిన్సిపాల్

స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎన్ఆర్ పేట సెయింట్ జోసెఫ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.హర్షిక ఎంపికైంది. అండర్-17 విభాగం కృష్ణా జిల్లా నూజివీడులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రిన్సిపాల్ ఐశ్వర్య విజేతను అభినందించారు. హెచ్ఎం మెర్సీ, అరుణ అభినందించారు.

ఒప్పందం మేరకు సమానంగా వేతనాలు ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్, ఐ-హాస్పిటల్, కంటి ఆసుపత్రి నర్సింగ్ కాలేజీ హాస్టల్, మెడికల్ కాలేజీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు పద్మావతి కోరారు. బుధవారం పెర్టిలిటీ సర్వీస్ ఏజెన్సీకి వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికునికి ఒక్కొక్కరికి రూ.13,960 ఇవ్వాల్సి ఉండగా.. రూ.8వేల నుంచి చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ సమానంగా ఇవ్వాలన్నారు.

రాజ్యాంగ ప్రాముఖ్యత తెలియజేయాలి



విద్యార్థికి ప్రశంసా పత్రం ఇస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు అర్బన్ /లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాలని సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాప్రాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక, ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. చట్టాలన్నీ రాజ్యాంగానికి లోబడే ఉండాలని తెలిపారు. వైఎస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. న్యాయవాదులు వై.జయరాజు, రవి కుమార్, ఈగల్ టీమ్ సీఐ సృజనకుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్‌కుమార్, రాయపాటి శ్రీనివాస్, మాజీ సైనికాధికారి కేడీజే బాబు, శాన్వాజ్, ఆధ్యాపకుడు హేమంత్ కుమార్, ఆదినారాయణరెడ్డి, డి. నాగన్న, శ్రీనివాస్ రెడ్డి, వింద్యావాసీనీ దేవీ, సాజిదాబీ, జి, శ్రీనివాస్ పాల్గొన్నారు.,

● ప్రసూనా న్యాయ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ప్రిన్సిపాల్ డా.ఎం.శివాజీ రావు, ప్రొఫెసర్లు మెహమూజ్ పాషా, ఎస్ఏ రవూఫ్, మెహిది హుశేన్ ఖాన్, సునీత ఉన్నారు.

మహిళలకు గౌరవం ఇవ్వాలి



ఓర్వకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో అనసూయ, అధికారులు

ఓర్వకల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు తగిన గౌరవం ఇచ్చి, వారికి హక్కులు పొందేందుకు సాయం చేయాలని ఎంపీడీవో నాగ అనసూయ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో స్త్రీ, పురుష సమానత్వంపై పొదుపు సభ్యులకు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించి, పతిజ్ఞ చేయించారు. బాల్య, వివాహాలను వ్యతిరేకించాలని, మహిళలను గౌరవించాలని సూచించారు. ఎస్ఐ సునీల్ కుమార్, ఏపీఎం శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సి. బెళగల్: వెలుగు ఏపీఎం రమేష్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమన్నారు. డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు సిబ్బంది ఉన్నారు.



పెద్దాసుపత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ వార్డు వైపు వున్న లిఫ్టు 5 రోజులుగా పనిచేయడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే హృద్రోగులు, నరాల, మెదడు సంబంధ రోగులు ఇక్కడి నుంచే పై అంతస్థులలో ఉన్న వార్డుకు వెళ్లాలి. లిఫ్టు పనిచేయక రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. **- కర్నూలు హాస్పిటల్.**

రైతు బజారును శుభ్రం చేయాలి



రైతు బజార్‌లో వ్యర్థాలను చూపుతున్న నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెంకటరమణ కాలనీ సమీపంలో అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజారును శుభ్రం చేయాలని పౌర సంక్షేమ సంఘం నాయకుడు పుల్లారెడ్డి కోరారు. ఎక్కడ చూసినా కూరగాయల వ్యర్థాలు, చెత్తచెదారం పేరుకుపోయిందన్నారు. బుధవారం రైతుబజార్‌ను పరిశీలించారు. విక్రయదారులు, వినియోగదారులు దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల ప్రతినిధులు శ్రీనివాస్, అన్వర్ బాషా, ఆంజనేయ గౌడ్, మహ్మద్ యూసుఫ్, పురుషోత్తంరెడ్డి, గాజుల బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలలో ప్రతిభ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో అండర్-17, అండర్-19 విభాగంలో తమ విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అన్నారు. బుధవారం ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులను అభినందించారు. ఈ ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టు కెప్టెన్‌గా బోయ తలారి గర్జప్ప అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారన్నారు. హాలేవీడు మల్లికార్జున, బోయ అనిమేష్ ప్రతిభ చాటారని వీరు ముగ్గురు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దైవాదీనం రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కామిరెడ్డి, రామన్న పాల్గొన్నారు.

తుగ్గలి: సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన ఖోఖో పోటీల్లో తుగ్గలి హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారని జిల్లా పీఈటీల సంఘం కార్యదర్శి చందూ నాయక్ తెలిపారు. బుధవారం తుగ్గలి హై స్కూల్‌లో ఖో-ఖో పోటీలో విజయం సాధించి ప్రథమ స్థానం పొంది రూ.5వేలు నగదును గెలుచుకున్న ఖో-ఖో టీమ్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అగస్టీన్, ఉపాధ్యాయులు అభినందించారు

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఇంటింటికి వెళ్తాం


మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఇంటింటికి మీ వైకుంఠం జ్యోతి కార్యక్రమానికి గురువారం నుంచి శ్రీకారం చుడుతున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి బుధవారం తెలిపారు. ముందుగా ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాల గ్రామంలో సాయంత్రం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలు నా దృష్టికి తీసుకొస్తే అక్కడే అధికారులతో చర్చించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు.

చదువుతో పాటు క్రీడలు

మద్దికెర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయనీ, చదువూ, క్రీడలు రెండూ ముఖ్యమేనని రాష్ట్ర జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు హరిప్రసాద్ యాదవ్, ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థాపకులు చొక్కా సునీల్ కుమార్ యాదవ్, పులికొండ యాదవ్ అన్నారు. బుధవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా మద్దికెరలో క్రీడా మైదానంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపిన మొదటి బహుమతి గుంతకల్లు జట్టుకు రూ.20వేలు, ద్వితీయ బహుమతి బళ్లారి జట్టుకు రూ.15వేలు, మూడో స్థానంలో గుంతకల్లుకు రూ.10వేలు, నాలుగో బహుమతి తుగ్గలి జట్టుకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు గోవిందు, శివ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రైతులకు న్యాయం


మద్దికెరలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

మద్దికెర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని, ఆయన ద్వారానే రైతులు అభివృద్ధి చెందారని వారికి న్యాయం జరుగుతుందని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విజోభ, మండల బీటీడీపీ కన్వీనర్ హుసేన్ పీరా, వ్యవసాయాధికారి రవి అన్నారు. బుధవారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతులు మీకోసం అనే కరపత్రాలను రైతుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. టీడీపీ నాయకులు గొడుగు సతీష్ కుమార్, గుడి ఎల్లప్ప, వ్యవసాయ సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

తుగ్గలి: ఆధునిక పద్దతుల్లో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏవో సురేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. జి.ఎర్రగుడి, మారెళ్ల గ్రామాల్లో రైతులు మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎంపీటీసీ వెంకట్రాముగౌడు, తిరుపాల్ నాయుడు, డీవీఆర్ వెంకట్రాముడు, వెంకట్, ఎల్లప్ప పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏఓ వెంకటరాముడు సూచించారు. జూటూరు, నలకదొడ్డి, దేవనబండ, చిన్నహుల్తి, హోసూరు గ్రామాల్లో రైతుసేవా సిబ్బందితో కలిసి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆలూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం రాత్రి ఆలూరు పట్టణంలో రైతన్నా మీ కోసం అన్నదాత సుఖీభవ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ డబ్బులు జమ అయ్యాయా లేదానని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లప్ప, టీడీపీ నాయకులు నెట్టెప్ప, ముద్దురంగ, కిట్టు, గూళ్యం రామాంజనేయులు, మసాల జగన్, రామాంజినేయులు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం


హొళగుందలో సొసైటీ చైర్మన్ సన్మానిస్తున్న రైతులు

హొళగుంద , నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇది రైతు ప్రభుత్వం అని హొళగుంద సహకార సొసైటీ నూతన చైర్మన్ హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం అన్నారు. సహకార సొసైటీ చైర్మన్‌గా తనను ఎన్నిక చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్, ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చైర్మన్‌ను సహకార సొసైటీ మెంబర్‌లను రైతులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చిదానంద, సిబ్బంది నీలకంఠ, మల్లికార్జున పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

పత్తికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎద్దుల బండిపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి పత్తికొండ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బండి గింజల రంగన్న (63) మృతి చెందాడు. బుధవారం పొలం నుంచి ఎద్దుల బండిపై గ్రామానికి బయలుదేరిన ఆయన ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. హుటాహుటిన పత్తికొండ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాయకులు ఆసుపత్రికి వెళ్లి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

పాఠశాలలోకి పాములు వస్తున్నాయి..

తుగ్గలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల వద్ద వీధిలైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుందని, పాఠశాలలోకి పాములు వస్తున్నాయని విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్, హెచ్ఎం రాజారామ్ ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల ముందు వీధిలైట్లు వేయాలని పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామిని కోరారు. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి వీధిలైట్లు తెప్పించి వేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

దేవనకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు వీరశేకర్, ఏఐటీయూసీ నాయకులు నర్సారావ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ సుదర్శనంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నూరి, కండప్ప, కృష్ణ, రాజశేకర్, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ స్పీకర్‌గా విద్యార్థిని


పురపాలక ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు


మున్సిపల్ హైస్కూల్లో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

రాజ్యాంగ రక్షణ మన బాధ్యత

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ

ఆదోని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రక్షణ మనందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ నూరుల్‌ఖమర్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యత వివరణ ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రధాన శిల్పి భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రజలకు సేవ చేయడం ప్రధాన బాధ్యతగా భావించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ కొండయ్య, ఏఓ వసుంధర, సర్వేయర్ వేణుసూర్య పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు బుధవారం పట్టణంలోని పలు పాఠశాలలో విద్యార్థులు ఘనంగా జరుపున్నారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్, మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఆర్ఆర్ లేబర్ కాలనీ పాఠశాలలో ఉపాధ్యాయుడు వీరచంద్ర యాదవ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. సీఎం, డిప్యూటీ సీఎం, వివిధ శాఖల మంత్రులతో పాటు స్పీకర్ ఎమ్మెల్యేలు వేషధారణలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్ రాజ్‌కుమార్, రమేష్ నాయుడు, నాగరాజు, రాజా సతీష్, సుధాకర్, ప్రహ్లాద, లోక్యానాయక్, జాన్ విక్టర్ పాల్గొన్నారు.

దేవనకొండ: రాజ్యాంగంతోనే దేశం ఔన్నత్యం సాధ్యమని వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. మండలంలోని దేవనకొండ, జిల్లెడుబుడకల గ్రామాలలో రాజ్యంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాన్నికి పూలమాల వేశారు.

హాలహర్వి: భారత రాజ్యాంగం వల్ల బానిస బతుకులకు విముక్తి కలిగి అనేకమంది విద్యావంతులుగా మారి చీకటి జీవితంలో వెలుగు నింపుకున్నారని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం బి.ఆర్.అంబేద్కర్‌కు పూలమాలతో నివాళులు అర్పించారు.

మద్దికెర: భారత రాజ్యాంగం మన హక్కు అని.. దాన్ని సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యత అని తహసీల్దార్ గూండాల్ నాయక్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు, విద్యాసాయి కళాశాల ఎండీ వెంకట మాధవ్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. విద్యాసాయి ప్రిన్సిపాల్ బాల సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవరాజు, మాజీ ఎంపీటీసీ విష్ణు, చంద్ర ఉన్నారు.

● చదువుకునే ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే.. మంచి ప్రయోజకులు అవుతారనీ ఎంపీడీవో కొండయ్య, మండల విద్యాధికారి రంగస్వామి, ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. బుధవారం విద్యాసాయి కళాశాలలో జాతీయ న్యాయ దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం హక్కుల గురించి ప్రతిభ పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో శ్రీ విద్యాకళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్, ప్రిన్సిపాల్ బాల సునీత తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: పట్టణంలోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో కర్నూలు జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన ముఖ్యఅతిథులుగా పాల్గొని డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, అధ్యాపకులు వరలక్ష్మి పాల్గొన్నారు.

తుగ్గలి: డా.బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమేష్ తెలిపారు. బుధవారం జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిం చారు.

హొళగుంద: దేశ తలరాత మార్పుకు రాజ్యాంగం పునాది లాంటిదని ఉషోదయం గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సీహెచ్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక సీజనల్ హాస్టల్‌లో భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు దుర్గయ్య, షోయబ్ విద్యార్థులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో మంత్రిగా వెల్దుర్తి విద్యార్థిని గాయత్రి



పత్తికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ఆవరణంలో ప్రభుత్వం బుధవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గం తరుపున వెల్దుర్తి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సి.గాయత్రీ పాల్గొన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిగా అసెంబ్లీలో గాయత్రీకి బాధ్యతలు అప్పగించారు. ఐసీడీఎస్ వ్యవస్థ తీరు అంగన్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అంశాలపై ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్థానంలో గాయత్రీ సమాధానం ఇచ్చారు. దేవనకొండకు చెందిన రంగన్న స్వాతి దంపతుల కుమార్తె గాయత్రి వెల్దుర్తి గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది.


మద్దికెరలో డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అధికారులు, నాయకులు


జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో ...


హొళగుందలోని సీజనల్ హాస్టల్‌లో..


జిల్లెడు బుడకల పాఠశాలలో రాజ్యంగ దినోత్సవంలో పాల్గొన్న వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ

అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

- రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ఆలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రోటోకాల్ విస్మరించారని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ బుధవారం మండిపడ్డారు. ఆలూరు నియోజకవర్గానికి చెందిన నేను కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ హోదాలో ఉన్నా కనీసం అధికారులు పిలవకపోవడం సరి కాదన్నారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

లింగ వివక్ష విడనాడాలి

దేవనకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష లింగ భేదం విడనాడి అందరు సమానమేనని ఎంపీడీవో జ్యోతి, టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ఆవరణంలో మానవహారం చేశారు. మగ, ఆడ లింగ బేధం లేకుండా అందరు సమనమేనన్నారు. మహిళల ఆర్థిక స్వాలంభన సాధించాలని, కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే, అందరు కలసికట్టుగా ఉండాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, వెలుగు ఏపీఎం లక్ష్మమ్మ, ఉచ్చీరప్ప, బుక్‌కీపర్లు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో పంటలను రక్షించుకోవాలి


మిరుప పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆదోని రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో పంటలను రక్షించుకోవాలని ఉద్యానవన అధికారి రఘువరణ్, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్త మౌనికలు తెలిపారు. బుధవారం పెద్ద హరివాణంలోను మిరుప పంటలను వారు పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ, మిరుప పంటకు సోకిన వైరస్, తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల సూచనలతో మందులను పిచికారి చేసి పంటలను రక్షించుకోవాలన్నారు.

వ్యర్థాలతో సంపద


మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మీ

హాలహర్వి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలతో సంపద సృష్టించుకోవాలని ఎంపీడీవో వరలక్ష్మీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత కనపడాలంటే ప్లాస్టిక్ నిషేధించాలన్నారు. వ్యర్థాలతో సంపద సృష్టించుకుని ఆదాయం పొందవచ్చని ఆమె వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, కార్యదర్శులు ఓంకార్, శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పాటుపడండి


చెత్తసంపద కేంద్రాని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

దేవనకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు పాటు పడాలని జడ్పీ సీఈవో నారసరెడ్డి అన్నారు. మండలంలోని కరివేములలో బుధవారం పర్యటించారు. గ్రామంలో పర్యటించి, చెత్తసంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి గ్రామపంచాయతీకి ఆదాయం సమకుర్చేలా చుడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో నిర్వహించే స్వామిత్వ ఆధార్ మ్యాన్‌డటరీ, ఇంటింటి సర్వే, కౌషల్ సర్వేలను పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నుల చెల్లింపులు ఆన్‌లైన్లో జరగాలన్నారు. సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ నిర్ధేశించిన లక్ష్యలను పూర్తి చేయాలని సుచించారు. ఎంపీడీవో జ్యోతి. డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, పంచాయతీ కార్యదర్శులు రాముడు, సునీల్, వీఆర్వో రాజన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

ఆదోని రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగలాపురం అంగన్‌వాడి సెంటర్-2 కార్యకర్త పుష్పవతి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 10వ తేదీన సంబంధిత సెంటర్‌లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు విధితమే. దీంతో విచారణ చేపట్టి అంగన్‌వాడీ టీచర్ పుష్పావతి, ఆయా ఆయామ్మ నిర్లక్ష్యం వలనే విద్యార్థులు అస్వస్థతకు కారణమని తెలిసి ఇరువురిని విధుల నుంచి కలెక్టర్ డాక్టర్ ఏ సిరి తొలగించారు. దీంతో బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీ సెంటర్‌కెళ్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని స్వాధీనం చేసుకొని అంగన్‌వాడీ కార్యకర్త పుష్పావతిని బయటకు పంపించారు. దీంతో ఒక్కసారిగా పుష్పావతి బీపీ డౌన్ అయి పడిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటీన ఆదోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న సీఐటీయు నాయకులు సోమ న్న, సోమక్క, వెంకటలక్ష్మీ, తిక్కన్న పరామర్శించారు.

దరఖాస్తు చేసుకోవాలి

పత్తికొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన మహిళలు ప్రభుత్వం మంజూరు చేసే నూతన పక్కా గృహాలకు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కవిత పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తే పోరాటాలు


పత్తికొండలో నిరసన తెలియజేస్తున్న కార్మిక సంఘాలు

పత్తికొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాయడం చేస్తే పోరాటాలతో ప్రతిఘటిస్తామని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కృష్ణ, రవిచంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పత్తికొండలో వామపక్ష కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో నిరసన చేపట్టారు. కార్మిక సంఘాల నాయకులు రంగన్న, నెట్టికంటయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ఆదోని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆదోనిని జిల్లాగా ప్రకటించాలనే చిరకల డిమాండ్‌ను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆదోనిని జిల్లా చేయాలంటూ పార్టీలకు అతీతంగా ముక్తకంఠంతో జిల్లా కావాలని కోరుతున్నారని తెలిపారు.

టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్ కుటుంబానికి స్నేహితుల సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పత్తికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన టీటీడీ మాజీ ఏవీఎస్వో, జీఆర్పీ సీఐ వై. సతీశ్ కుమార్ కుటుంబానికి ఆయన స్నేహితులు సాయమందించారు. 2012 ఏఆర్ అండ్ ఏపీఎస్పీ బ్యాచ్‌కు చెందిన సతీష్ కుమార్ ఈనెల 15వ తేది తిరుమల పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు రైల్లో బయల్దేరి అనూహ్యరీతిలో పట్టాలపై శవంగా దర్శనమివ్వడం సంగతి తెలిసిందే. బుధవారం సతీశ్‌కుమార్ కర్మక్రియలకు హాజరైన ఆయన బ్యాచ్‌మేట్స్ ఆర్థికసాయమందించారు. సతీశ్‌కుమార్ తల్లి పేరిట 3లక్షలు, పిల్లల పేరిట రూ.11లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. ఏపీ, తెలంగాణకు చెందిన బ్యాచ్‌మేట్స్ మోడెం సురేష్, అర్జున్, నరసింహ, విజయకుమార్, షరీఫ్, రంగనాథ్, మాదప్ప, మనోహర్, శ్రీనివాస్, ప్రదీప్, సుధాకర రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం


స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న పురోహితులు


ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో హనుమద్వాహనంపై ఊరేగిస్తున్న చెన్నకేశవస్వామి

మద్దికెర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలో మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దాదాపు వంద మంది దంపతులతో శాంతి హోమాలు చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణోత్సవం ఆలయ ప్రధాన నిర్వాహకులు ఎస్.విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పవన్ కుమార్, రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు హరిప్రసాద్ యాదవ్, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు శివప్రసాద్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

హనుమ వాహనంపై చెన్నకేశవస్వామి

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామంలో వెలిసిన చెన్నకేశవస్వామి రథోత్సవ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి హనుమద్వాహనం, అశ్వవాహనం, గరుడ వాహనాలపై చెన్నకేశవస్వామి లక్ష్మీ భూదేవి సమేతంగా గ్రామ పురవీధుల్లో స్వామివార్లను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. స్వామివారి విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ నందికోలు ఆడుతూ భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి సజ్జ పిండితో చేసిన కుడుములతో విసురుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మొలగవల్లి లక్ష్మీరెడ్డి, సర్పంచ్ మోహన్‌రాజ్, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారుకొం డ శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ బెవిన ఈరన్న, శివస్వామి, విద్యాకమిటీ చైర్మన్‌లు చిలక సురేష్, షేక్షావలి, బెలగంటి హనుమప్ప, ఎంపీటీసీ బంగారు సునందపటేల్ యాదవ్, అశోక్‌యాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆస్పరి: కలపరి గ్రామంలో వెలిసిన సుంకులమ్మ కలశ ప్రతిష్ఠ బుధవారం జరిగింది. ఆలయంపై నూతనంగా నిర్మించిన గోపురం శిఖరంపై కలశ ప్రతిష్ఠాపన వేద పండితులు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టప్ప, గంగన్న, చంద్రప్ప, గిడ్డయ్య, ఉరుకుందు, ఓబులేష్, మల్లయ్య పాల్గొన్నారు.

19 అంశాలకు ఆమోదం

● ఎమ్మిగనూరు జాతరకు ఏర్పాట్లు చేయండి
● కౌన్సిల్ సమావేశంలో పలు నిర్ణయాలు

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 19 అంశాలకు ఆమోదం తెలుపుతూ సభ్యులు తీర్మానించారు. బుధవారం చైర్మన్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో ప్రవేశపెట్టిన రోడ్లు, డ్రైన్లు,మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల పెంపు, యుజీడీ అభివృద్ధి, టెండర్లు రద్దు వంటి 19 అంశాలను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ రామదాసు గౌడ్, బీజేపీ సభ్యుడు దయాసాగార్ మాట్లాడుతూ మున్సిపాలిటిలో పని చేస్తు మృతి చెందిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సమీపిస్తోందని అధికారులు జాతరకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం వైసీపీ సభ్యులు ఖాసీం బేగ్ మాట్లాడుతూ వార్డులో రోడ్డు, డ్రైనేజీలు వేసేందుకు టెండర్లు పూర్తయ్యాయని పనులు మాత్రం ప్రారంభం కాలేదని ఇంకా ఎన్నిరోజులు కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘంలో పనిచేస్తూ 2020-24 మధ్యలో మరణించిన కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలని మూడుసార్లు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించి, ఉన్నతాధికారులకు పంపటం జరిగిందన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఇప్పటికే కలెక్టర్‌దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారన్నారు. కలెక్టర్ కూడా ఉద్యోగాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దివ్యకళ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

కౌన్సిల్ సమావేశాన్ని ముట్టడించిన కార్మిక సంఘాలు

ఎమ్మిగనూరు: మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు కౌన్సిల్ సమావేశాన్ని ముట్టడించారు. కౌన్సిల్ హాల్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించటంతో పోలీ సులు అడ్డుకున్నారు. దీంతో కౌన్సిల్ హాల్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి, అధికారులను అడ్డుకోవటంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు, సం ఘాల నాయకులకు సర్దిచెప్పేందుకు కమిషనర్ ప్రయత్నించి నప్పటికీ సంఘా నాయకులు శాంతించలేదు. ఉద్యోగాల నియ మాక పత్రాలు ఇచ్చేవరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిమ్మగురుడు, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికసంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వరకట్న నిషేధ, చైల్డ్‌రైట్స్ చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన న్యాయాధికారి హేమ మాట్లాడుతూ వరకట్నం ప్రోత్సహించడం కూడా నేరం అని వివరించారు. చైల్డ్‌రైట్స్‌పై చట్టాలను వివరించారు. ప్రతి ఒక్కరు చట్టాల గురించి, వారి హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విద్యార్థులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే మండల న్యాయ సేవాదికాక సంస్థ ఎమ్మిగనూరు వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రషీద్, న్యాయవాది విమల, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం పీఠాధిపతికి డాక్టరేట్


పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు ఆఫ్రికా దేశానికి చెందిన మైలేస్ లీడర్‌షిప్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రవి ఆచార్యులు డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్ తెలిపారు. ఈ నెల 29న శనివారం యోగీంద్ర మండపంలో పీఠాధిపతికి డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. ఇప్పటికీ గుల్బర్గా, బళ్లారి యూనివర్సిటీలు వేర్వేరుగా రెండు డాక్టరేట్లు వచ్చాయి. అవార్డు ప్రదానోత్సవానికి ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

అయ్యప్ప స్వాముల ర్యాలీ

కోసిగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్పస్వాములు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఎన్టీఆర్ నగర్‌లోని అయ్యప్పస్వామి ఆశ్రమం నుంచి మార్కెండేయ స్వామి దేవాలయం, కోసిగయ్య గుడి వరకు, కోసిగయ్య గుడి నుంచి అయ్యప్పస్వామి ఆశ్రమం వరకు గురుస్వాములు ముత్తురెడ్డి స్వామి, గోవిందరాజుల స్వామి, మూర్తి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి చిత్రపటాన్ని భజనలు, భక్తిగీతాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు భిక్షా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థి

గోనెగండ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని ఇంటినుంచి విద్యార్థి పారిపోయాడు. ఈ ఘటన మండలంలోని కులుమాల గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరెకంటి రాజు కుమారుడు ఏబేలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. నాలుగైదు రోజులుగా కుమారుడు పాఠశాలకు సక్రమంగా వెళ్లక పోవడంతో తండ్రి మందలించాడు. దీంతో పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి రాజు గ్రామంలోని స్నేహితుల దగ్గర విచారించగా పాఠశాలకు రాలేదని తెలిపారు. అలాగే తన బంధువుల గ్రామాల్లో కూడా విచారించిన ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐకెఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సోమప్ప సర్కిల్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. నేటికీ కేంద్రం ప్రకటించిన పంట నష్టపరిహారం రాష్ట్రాలకు అందలేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం సరికాదన్నారు. కార్మికులకు 12 గంటల పని వలన తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పనపై స్పష్టత ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. తక్షణమే కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం సత్యన్న, సీఐటీయూ జిల్లా నాయకులు గోవిందు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాజు, రాముడు, తిమ్మగురుడు, బాబు, మల్లికార్జున, రమేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనదారులతో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్‌ఐ మల్లికార్జున

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్లు గ్రామ రహదారిలో ట్రైనీ ఎస్‌ఐ మల్లికార్జున బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ప్రమాదాలకు అధికమవుతున్నాయన్నారు. అతివేగమే ప్రమాదాలకు కారణమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, ఇప్పటికే క్రిటికల్ కేర్ సెంటర్‌కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆదినగేష్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పీపీపీ పద్ధతి ద్వారా ఆసుపత్రికి అధునాతనమైన వసతులు సమకూరుతాయన్నారు. పేదలకు ఉచితంగా మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. రూ.30లక్షలతో ఆయూష్ భవనం కూడా మంజూరైందన్నారు. 200 పడకల ఆసుపత్రి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ సమావేశంలో హెచ్‌డీసీ సభ్యులు అంబేడ్కర్, వైద్యులు సుధా అయ్యాంగార్, చేనేత కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్ పాల్గొన్నారు.

● **మృతుల కుటుంబాలకు పరామర్శ :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోడబండ గ్రామానికి చెందిన వడ్డే కేశన్న, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న గోనెగండ్ల మండలం ఎన్నెకండ్లకు చెందిన రైతు సోమేశ్వర రెడ్డికి ఎమ్మెల్యే బీవీ నివాళులర్పించారు. మృతదేహాలకు పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సురక్షిత తాగునీరు సరఫరా చేయాలి

కోసిగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని ఆదోని డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి బాల కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సాతనూరు గ్రామ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ ఎస్‌ఏపీ స్కీమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి ఉన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మసీదుపురంలో రైతన్నా మీకోసం- అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు ఎలాంటి సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి అన్నదాత సుఖీభవ నగదును అందజేశామన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. మసీదుపురం గ్రామం తనకు సొంతగ్రామమని తనకు ఓటు వేయని వారికి కూడా సంక్షేమ పథకాలు అందేలా చూశానన్నారు. ఈ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, నాయకులు రఘు, రాముడు, వీరేష్, అధికారులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే టీడీపీ ధ్యేయం: రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం: రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు టీడీపీ నాయకులు గ్రామాల్లో పర్యటిచారు. బదినేహాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఎంత ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. పత్తి రైతులను ఆదుకుని మద్దతుధర ప్రకటించడంతో పాటు సీసీఐ పనివేళలను మార్చాలని కోరుతూ రాఘవేంద్ర రెడ్డి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన కౌతాళంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్ నాయుడు, కౌతాళం సొసైటీ అధ్యక్షుడు వెంకటపతిరాజు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్, నాయకులు కోట్రేష్ గౌడ్, రమేష్‌గౌడ్, ర హిమాన్, సిద్దు, రాజబాబు,బీజేపీ నాయకులు నబి, జనసేన నాయకులు రామాంజనేయులు మండల వ్యవసాయాధికారి శేషాద్రి పాల్గొన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం: టీడీపీ

నందవరం: కూటమి రైతుల ప్రభుత్వమని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, మండల సహకార సంఘం అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్ అన్నారు. బుధవారం మాచాపురం గ్రామంలో రైతన్న మీ కోసం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే చిన్నకొత్తిలి గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో, పెద్దకొత్తిలిలో ఎస్కేల్, మిట్టాసోమాపురంలో ఎంపీటీసీ లక్ష్మీ, వీరేష్ , రామలింగడు, రాయచోటిలో రామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, ధర్మాపురం చంద్రశేఖర్, వలి, మూబువుసేన్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండలంలోని గంగులపాడు గ్రామంలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వరకాంతరెడ్డి గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, రాఘవేంద్ర, శ్వేత, సంజీవ్‌కుమార్, సోమన్న, అంపయ్య పాల్గొన్నారు.


మసీదుపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


బదినేహాల్‌లో టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు


మాచాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మున్సిపల్ కార్యాలయం పరిశీలన


ట్రైనీ కలెక్టర్ల బృందంతో కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్ల బృందం పరిశీలించింది. 2023 బ్యాచ్‌కు చెందిన శుభాంగి సుదర్శన్ కెకన్ , నిధి గోయల్ , ఎండి భూరాన్ జమాన్, అశుతోష్ గుప్తా, రామ్‌శంకర్ మీనా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని వివిధ విభాగాల గురించి వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ గంగిరెడ్డి మున్సిపల్ ఆదాయ వనరులు, ఖర్చులు, చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల బాధ్యతల గురించి వివరించారు. అనంతరం 4వ వార్డులోని శివన్ననగర్‌లో పర్యటించారు. శానిటేషన్, రోడ్లను, సచివాలయాన్ని పరిశీలిం చారు. డీఈలు రాజు నాయక్, నీరజ, అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యను ప్రైవేటీకరించొద్దు: వైసీపీ

నందవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయొద్దని జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, శవాల బుజ్జి డిమాండ్ చేశారు. బుధవారం నందవరం ఎస్సీ కాలనీలో వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. కూటమి ప్రభుత్వం చేసే కుట్రలను ప్రజలకు వివరించామన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు శవాల భాస్కర్, తాయన్న, అబ్రహాం, పరంపోగు దుబ్బన్న, శవాల కిరణ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కోసిగి రోడ్డులో వెలసిన సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యుజీ రఘువీర, ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

● తహసీల్దారు శ్రీనివాసులు

నందవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నెలో ప్రభుత్వ స్థలాల్లో, పట్టాలు మార్చి షెడ్లు నిర్మించుకునే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో నవంబరు 8న ప్రచురితమైన 'ఖాళీ జాగా.. వైసీపీ పాగా' కథనాన్ని పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సిరి విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారించి నివేదికలు పంపామని తహసీల్దార్ తెలిపారు. భూములను కబ్జా చేసిన వారికి నోటీసులు పంపినట్లు తెలిపారు. వీరిలో కొందరు కోర్టును ఆశ్రయించారని, ఆ వివరాలను కూడా కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం



మాధవరంలో వీరభద్రస్వామిని అలంకరించిన దృశ్యం, స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం కార్తీకమాసం పూజల్లో భాగంగా ఉదయం నుంచి వీరభద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి హారతులు ఇచ్చారు. అనంతరం చిన్నసూగయ్య స్వామిని రథంపై ఆశీనుల చేసి రథాన్ని ఊరేగించారు. కర్ణాటక నుంచి భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జంగం వీరన్న స్వామి, అల్లె వీరభద్రప్ప, వీరేష్, శంకరప్ప, బ్రహ్మయ్య, నరసన్న, భక్తులు పాల్గొన్నారు.

కుంటనీటితో ప్రమాదం లేదు


కులుమాల కుంటనీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన

గోనెగండ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కులుమాల గ్రామంలోని నీటి కుంట వల్ల గ్రామస్థులకు, మూగజీవాలకు ఎలాంటి ఇబ్బంది లేదని డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, కార్యదర్శి రామదాసు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రిక యందు 'నల్లగా మారిన నీటి కుంట నీరు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. అందుకు గాను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవో సిబ్బంది స్పందించి కుంటనీటిని ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నీరు నిలువ ఉండటం కారణంగా రంగు మారిందన్నారు. పశువులు తాగినప్పటికీ ఎలాంటి హాని లేదన్నారు.

ముగతిలో వైద్యశిబిరం

నందవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు రక్తపోటు, మధుమేహం, రక్తపరీక్షలు నిర్వహించారు. సెయింట్ జోషఫ్ కళాశాల డాక్టర్లు శ్రీనివాసులు,జగదీష్, గోపాల్, వాగేష్, సావిత్రి పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కౌతాళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆయా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. కౌతాళం పంచాయతీ కార్యాలయం, ప్రతిభ హైస్కూల్, కళాశాల యందు రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతిభ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకరన్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శమని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాలల్లో, కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, ఏపీఎం హైమలత, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: పట్టణంలో సమతా సైనిక్‌దళ్, పూలే అంబేడ్కర్ సొసైటీ కార్యాలయాలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యదర్శి రంగయ్య, పూలే అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లెల అల్ఫ్రెడ్ రాజ్, డాక్టర్ కామలే గణేష్, తిమ్మరాజు, పందికోన ఈరన్న, నరసన్న, రాజోలప్ప, నాగప్ప పాల్గొన్నారు.

నందవరం: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అదనపు ఎంపీడీవో సందీప్, ఏవో కృష్ణమూర్తి, ఏపీఎం రాఘవేంద్ర, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


కౌతాళం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


గోనెగండ్లలో..